కష్టమే మిగిలింది

- ఆర్థిక ఇబ్బందుల్లో పంక్చర్ కార్మికులు
- రెక్కాడితే గాని డొక్కాడని వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. ఎండనకా, వాననకా పొద్దస్తమానం కష్టపడితే చేతికి వచ్చేది కొద్ది మొత్తమే. దాంతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. దీనావస్థలో కొట్టుమిట్టాడుతున్న టైర్ల పంక్చర్ కార్మికులు తమ బతుకులు బాగుపడాలంటే ప్రభుత్వం ఆదుకోవాలని అర్థిస్తున్నారు.



అల్లిపురంలోని దుకాణంలో పని చేస్తున్న చుక్క అప్పారావు

బతుకు చిత్రం



మెయిన్‌రోడ్డు దుకాణంలో సైకిళ్లకు పంక్చర్లు వేస్తున్న భవానీ

అల్లిపురం: నగరంలో వాహనాలకు పంక్చర్‌లు వేసే కార్మికులు దుర్భరమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో సుమారు 100 మందికి పైగా పంక్చర్ వేసే కార్మికులు రోడ్డు పక్కన చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని బతుకీడుస్తున్నారు. రోజంతా కష్టపడితే రూ.200 నుండి రూ.300 లభిస్తుందని, అది గిట్టుబాటు కావటంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటితో ముడిసరుకులు కొనుక్కుని, రోజువారి ఫైనాన్స్‌లు కట్టుకుని, కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. పెరిగిన రేట్లతో ఆ సంపాదన కుటుంబాలను నెట్టుకురావడానికి సరిపోవడం లేదంటున్నారు. ఈ కాలంలో ట్యూబ్‌లెస్ టైర్లు గల వాహనాలు ఎక్కువగా వస్తున్నాయి. వాటి వల్ల తమ గిరాకీ పడిపోతుందని వారు చెబుతున్నారు. స్కూటీలు, చిన్న పిల్లల సైకిళ్ల రిపేర్ వల్ల అనుకున్నంత మొత్తం రాదు. దీంతో అరకొర సంపాదనతో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. తమలాంటి పేదవాళ్లకు ప్రభుత్వం ఇళ్లు కేటాయించాలని అభ్యర్థిస్తున్నారు.

హామీలేని రుణాలివ్వాలి



మేము వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా హామీ లేని రుణాలు ఇప్పించాలి. ఎటువంటి ఆధారం లేని మాకు హామీ ఎవరిస్తారు? రోడ్డు పక్కన చిన్నచిన్న డబ్బాలు పెట్టుకుంటే జీవీఎంసీ వారు తీసుకెళ్లిపోతున్నారు. బ్రతుకు కష్టంగా ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

–భవానీ, సైకిల్ పంక్చర్ కార్మికుడు, అల్లిపురం

రూ. 100 కూడా రావడం లేదు



రోజంతా కష్టపడినా రూ.100 కూడా రావటం కష్టంగా ఉంది. దీంతో అప్పులు చేసుకోవాల్సి వస్తుంది. వచ్చిన దాంట్లో అప్పులకు సగం పోతుంది. ఇంటి ఖర్చులకు సగం పోతుంది. 60 ఏళ్లుగా నేను ఇదే వృత్తిలో ఉన్నాను. ఇప్పుడు నాకు 75 సంవత్సరాలు. అప్పటికి ఇప్పటికి నా బ్రతుకులో మార్పు రాలేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

–చుక్కా అప్పారావు, సైకిల్ మెకానిక్, అల్లిపురం

పక్కా దుకాణాలు ఏర్పాటు చేయాలి



మాకు ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందించాలి. దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు తగిన స్థలం ఏర్పాటు చేయాలి. వచ్చే అరకొర ఆదాయంతో అద్దెలు కట్టుకోలేక చాలా మంది వృత్తిని వదులుకుంటున్నారు. ఎవరో ఒకరి దగ్గర కూలీగా చేరుతున్నారు. అరకొర ఆదాయంతో బ్రతుకటం కష్టంగా ఉంది. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాము.

–బొద్దు పోలారావు, కెప్టెన్ రామారావు జంక్షన్

క్లుప్తంగా

బల్లిగిరికి భక్తుల తాకిడి



విశేష అలంకరణలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శనివారం స్వామి వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవీ, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర శతనామార్చనలు చేపట్టారు.

ఆటలతో ఆరోగ్యం



ఖోఖో ఆడుతున్న చిన్నారులు

అల్లిపురం: ఆటలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని రంగిరీజు వీధి బాలల శాఖా గ్రంథాలయం గ్రంథాలయాధికారి టి.పోలితల్లి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆమె పిల్లలతో పాతతరంలో పిల్లలు ఆడుకునే ఖోఖో, కప్పగంతులు, బాల్ పాసింగ్ గేమ్ వంటివి ఆడించారు. సెల్‌ఫోన్‌లో ఆడే ఆటల కంటే శరీరానికి వ్యాయామం అందించే ఇటువంటి ఆటల వలన ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు.

రక్తదాన శిబిరం జయప్రదం చేయండి

సీతమ్మధార : విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ శ్రీనివాస్, పి.శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. మే 30వ తేదీ 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, డ్రైవరు సోదలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఓలా, ఉబర్ సంస్థల్లో విశాఖలోని నాలుగు వేల మంది క్యాబ్ నడుపుతున్నారని అన్నారు. తమ దగ్గర 30 నుంచి 40 శాతం కమిషన్ తీసుకుంటున్నారని, ఇది చట్టరీత్యా నేరమని తెలిపారు. కేరళ తరహాలో రాష్ట్ర ప్రభుత్వమే యాప్ పెట్టి 8 శాతం కమిషన్ తీసుకుని నడపాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివ, శరత్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

అల్లిపురం: ఎన్‌టీఆర్ శత జయంతి సందర్భంగా ఆయన అభిమానులు వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో శనివారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల రోజులుగా ప్రతి శనివారం గ్రంథాలయం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపడుతున్నామన్నారు. ఈ వారం ఎన్‌టీఆర్ అభిమానులు పాలమరశెట్టి శ్రీనివాసరావు సహకారంతో చేసిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సరగడం మోహన్, సూరిశెట్టి శంకరరావు, కోరిబిల్లి ఆది, త్రినాథ్‌బాబు, యల్లపు గోపాలరావు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన తప్పనిసరి

మహారాణిపేట : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం కేజీహెచ్ గవర్నమెంటు నర్సింగ్ స్కూలు సమావేశ మందిరంలో జరిగిన ముగింపు శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ లైన్ ఏర్పాటుకు చర్యలు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పునర్నిర్మాణ పనులు చేపట్టాలని వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు జీవీఎంసీ అధికారులను కోరారు. శనివారం జీవీఎంసీ ఏఈ వాసుదేవరావు కార్పొరేటర్‌తో కలిసి పాత యూజీడీలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మురుగునీరు లీక్‌తో పడుతున్న ఇబ్బందులను వారికి తెలిపారు. దీంతో కొత్తగా ఏర్పాటు చేసే యూజీడీకి ఎటువంటి మార్పులు చేయాలో ఏఈ తెలిపారు. అలాగే వార్డులోని అంగన్‌వాడీ భవనానికి చిన్నారులు వెళ్లేందుకు రహదారి వెడల్పుపై కూడా సంబంధిత ఏఈ తేజశ్వనితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యూజీడీ నిర్మాణంపై చర్చిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు

కార్యకర్తల సమస్యలపై గ్రీవెన్స్

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సంక్షేమం, సంరక్షణకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం తన కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖలో ట్రస్ట్‌బోర్డు మెంబర్ల నియామకం చేయాలని నాయకులు వినతిపత్రం అందజేశారు. 38వ వార్డులో 7 ఏళ్ళ అబ్బాయికి గుండె ఆపరేషన్ నిమిత్తం ఆరోగ్యశ్రీ కార్డు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే తక్షణమే అధికారులతో మాట్లాడి ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయించారు. గాజువాక ప్రాంతానికి చెందిన హేమవల్లిక 10వ తరగతిలో 594 మార్కులు సాధించడంతో ఆయన తన రామబాణం కాలేజీలో ఉచితంగా ఇంటర్ మీడియట్ విద్యకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్పొరేటర్లు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

వన్‌టౌన్ రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం

జగదాంబ: వన్‌టౌన్ రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాలతో పనులు ముమ్మరం చేశారు. జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు 60 అడుగుల మేర రోడ్డు నిర్మాణానికి పనులు మొదలయ్యాయి. ఇప్పటికే రహదారి నిర్మాణానికి అనుగుణంగా 20 భవనాల హద్దుల మేరకు తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో ప్రజలు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



టర్నర్ చౌల్ట్రీ వద్ద కొట్టిన భవనం

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

మహారాణిపేట: రైతు భరోసా కేంద్రాలు ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులకు సరఫరా చెయ్యాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీపీ ప్రసాద్ రాజు అధ్యక్షతన జేసీ విశ్వనాథన్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ, సూక్ష్మ సేద్యం, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఖరీఫ్ 2023 సీజన్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా తగిన స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ జేడీ కె.మన్మథరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, పీడీ ఏపీఎంఐపీ, డీఎం మార్క్‌ఫెడ్, ఏపీ సీడ్స్ అభివృద్ధి అధికారి సాయినాథ్, ఏడీ మార్కెటింగ్ యాసిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్. చిత్రంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీపీ ప్రసాదరాజు

పర్యావరణంపై అవగాహన అవసరం

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొద్ది రోజులుగా లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, సందర్శకులకు పర్యావరణంపై జూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారిచే ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో నిలబెట్టి ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కలుగుతోందన్నారు.

యెర్నిమాంబ ఆలయంలో అన్నదానం



అన్నదానం కార్యక్రమంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, ఎండోమెంట్ అధికారి శిరీష

అల్లిపురం: జ్ఞానాపురంలో వెలసిన యెర్నిమాంబ అమ్మవారి దేవస్థానం వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ అధికారి కె.శిరీష, ఆలయ ఈవో సురేష్‌బాబా, వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది



అన్నదానం చేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

జగదాంబ: అన్ని దానాలు కంటే అన్నదానం గొప్పదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. శనివారం కొండా ప్రసన్నదేవీ పుట్టినరోజు సందర్భంగా కొండా రాజీవ్, సంజనాదేవీ జీవీఎంసీ 39వ వార్డు స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో 200 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హాస్పిటల్‌లో ఆరోగ్య,రక్తదాన శిబిరాలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో శనివారం ఉచిత ఆరోగ్య అవగాహన, హెల్త్ చెకప్, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రైల్వే ఉద్యోగులు, స్థానికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఫ్రీ హెల్త్ చెకప్, రక్తదాన శిబిరాలను వాల్తేర్ డివిజన్ మెడికల్ విభాగం, ఏఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంకులు సంయుక్తగా నిర్వహించాయి. కార్యక్రమాలను చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ తిరు అరుల్ జ్యోతి పర్యవేక్షణలో ముఖ్య అతిథి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ప్రతీ ఒక్కరూ రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సుమారు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.రైల్వే ఉన్నతాధికారులు సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన్) ఎ.కె.మహారాణా, డివిజనల్ ఇంజినీర్(వెస్) అభిషేక్, జోనల్ సివిల్ ఇంజినీరింగ్ ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీల తోపాటు పలువురు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ ఏర్పాటు

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గ పరిధిలో సోమవారం నిర్వహించే బైక్ ర్యాలీ నిమిత్తం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఆశోక్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో అర్హులైన 31 లక్షల మందికి జగనన్న ఇళ్ల పథకంలో ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో జగనన్నను గెలిపించే బాధ్యత పార్టీ నాయకులు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జీవీఎంసీ కార్పొరేటర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను అభినందిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జేసీ ఇ.పి. ప్రసాదరావు కోరారు. శనివారం ఉదయం ఆయన కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై పోటీలు జరుగుతాయని, చిత్రలేఖనంలో పాల్గొనే వారికి డ్రాయింగ్ షీట్ మాత్రమే ఇస్తామని తెలిపారు. వ్యాసరచన పోటీలో పాల్గొనే వారికి తెల్లకాగితాలు ఇస్తామన్నారు. అలాగే జూన్ 5న రామకృష్ణా బీచ్‌లో పర్యావరణ పరిరక్షణ కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని, అదే రోజు 10 గంటలకు చిల్డ్రన్ థియేటర్‌లో జరగనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు, పీసీబీ ఏఈలు మూర్తి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి జేసీ ప్రసాదరావు

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే

సీతమ్మధార: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యథలు నానాటికీ అధికమవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.అస్కారరావు అన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అక్టోబర్ 31 వరకు వివిధ దశల్లో ఉద్యమం నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే నవంబర్ నుంచి నిరవధిక సమ్మెకు దిగడానికి సైతం వెనుకాడబోమని తెలిపారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, డీఏల విడుదల, మెరుగైన పీఆర్‌సీ ప్రకటన వంటివి తమ డిమాండ్లు అన్నారు. ఏపీజీఈఎ అధ్యక్షుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైన తమ ఆందోళన పట్ల స్పందించి తక్షణమే చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవిశంకర్, విశాఖ నగర శాఖ అధ్యక్షుడు కృష్ణాజీ, ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు

ప్రభుత్వ రైల్వే పాఠశాల సమస్య పరిష్కరించండి

అల్లిపురం: ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యనందిస్తోన్న ప్రభుత్వ రైల్వే ఉన్నత పాఠశాల సమస్యను సహృదయంతో పరిష్కరించాలని పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రజా సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు శనివారం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 1967లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ పెద్దలకు మధ్య జరిగిన ఒప్పందంలో శాశ్వత ప్రాతిపదికన స్కూలు ఏర్పాటుకు అంగీకారం కుదిరిందన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 430 మంది పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఇటీవల డీఆర్ఎం కార్యాలయం నుంచి పాఠశాల స్థలాన్ని అప్పగించాలని లేఖ పంపించారని, దీనిపై డీఆర్ఎంను కూడా కలిసినట్లు తెలిపారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కలగజేసుకుని పాఠశాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోను పాఠశాలను అక్కడి నుంచి తొలగించకుండా రైల్వే అధికారులతో సంప్రదింపులు చేస్తామని హామీ ఇచ్చారు.



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

జగదాంబ: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఆర్థిక సాయం అందజేశారు. శనివారం జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకలు వీధిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాము కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడడంతో విషయం తెలుసుకున్న సాధిక్ ఆయన ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అందించారు. పార్టీలో సేవలందిస్తున్న వారికి సాయం చేసేందుకు ముందుంటానని హామీ ఇచ్చారు.



ఆర్థిక సాయం చేస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

రహదారి నిర్మాణానికి శ్రీకారం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పరిధిలోని పందుపుల్లల సందు నుంచి జీవీఎంసీ పాఠశాల వరకు సుమారు రూ. 10 లక్షలతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని ఈ రహదారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ జరుగుతున్న అభివృద్ధిని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పందుపుల్లల సందులో సీసీ రోడ్డు వేయిస్తున్న విల్లూరి భాస్కరరావు

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023–24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లులో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లోని ముగ్గురు సీనియర్ హెచ్‌ఎంలను సభ్యులుగా ప్రత్యేక టీమ్‌లను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, నిల్వ ఉన్న వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందంలోని సభ్యులు, సీనియర్ హెచ్‌ఎం ఇమండి పైడిరాజు తెలిపారు.



చంద్రపాలెం స్టాక్ పాయింట్‌లో బూట్లు పరిశీలిస్తున్న పైడిరాజు

ఆడుతూ.. పాడుతూ..

మురళీనగర్: విద్యార్థులు ఆటపాటల్లో పాల్గొనడం ద్వారా నిరంతరం ఉత్సాహంగా ఉంటారని రీసోర్స్ పర్సన్ జి.శిరీష అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లలు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఆటలు ఆడించి పాటలు పాడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ సమయాల్లో తమకు ఇష్టమైన క్రీడల్లో చిన్నారులు పాల్గొనాలన్నారు